క్లుప్తంగా

చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమిస్తే చర్యలు



పెనమలూరు: చిరు వ్యాపారులు రహదారులు ఆక్రమించి ట్రాఫిక్ సమస్యలు సృష్టించితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్‌సీఐ వెంకటనారాయణ అన్నారు. పంటకాలువ రోడ్డులో చిరు వ్యాపారులు రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేయటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందటంతో ఆదివారం పోలీసులు రంగంలోకి దిగారు. పంటకాలువను ఆక్రమించిన చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్ చేసి ఆక్రమణలు తొలగించారు. సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ చిరు వ్యాపారులు ట్రాఫిక్ సమస్యలు గమనించాలన్నారు. వారి వ్యాపారాల కోసం రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేయటం తగదన్నారు. ఇక మీదట రహదారులు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



పెనమలూరు: వేసవి దప్పిక తీర్చడానికి దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రంగా ఉన్నంతదున దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని చిన్మయ ధ్యాన మందిరంలో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈనెల 24న ప్రారంభమైన ఈ క్యాంపు వచ్చే నెల 4వ వరకూ నిర్వహిస్తారు. 7 నుంచి 12 సంవత్సరాల లోపు బాల, బాలికలకు ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకూ పలు కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం క్యాంపునకు హాజరైన విద్యార్థులకు పలు అంశాల్లో నిర్వాహకులు శిక్షణ ఇచ్చారు. సందేశాలతో కూడిన కథలు, పద్యాలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాలు, తల్లిదండ్రులు, గురు, దేశ భక్తి గురించి అవగాహన, వ్యక్తిత్వ వికాసం పెంపుదల వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు యోగ, స్తోత్రములు, భగవద్గీత 15వ అధ్యాయం, గేమ్స్, క్విజ్, పజిల్స్, ఆర్ట్స్, యాక్టివిటీస్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

275 మందికి ఉచిత వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డులోని మెడి వ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. వైద్య శిబిరంలో జనరల్, రక్తపోటు, మధుమేహం, ఆర్థో, ఈఎన్‌టీ, గైనకాలజీ, పిల్లలకు సంబంధించిన వ్యాధులకు ప్రముఖ వైద్య నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందించటంతో పాటుగా అవసరమైన రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మొత్తం 275 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి చైర్మన్ పంచకర్ల వరప్రసాద్, ఎండీ చక్రవర్తి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సుధా, వైద్యులు పవన్ సీతారామ్, వినీలా, జ్యోతి అభిషేక్, జీవీకే రావు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

పాయకాపురం(విజయవాడరూరల్): పుట్టింటి వద్ద ఉంటున్న భార్యను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు నానుతాడు తీసుకెళ్లిన భర్తపై నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పశ్చిమ గోదావరి జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన మెట్టకాయల శ్రీదేవి, ఆమె భర్త రాంబాబు 25 సంవత్సరాలుగా రాజీవ్‌నగర్ ఉడాకాలనీలో మెడికల్‌షాపు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల రాంబాబు మానసిక స్థితి సరిగా లేక తరుచూ భార్యతో గొడవ పడటం, మానసికంగా ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఆమె నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఈ నెల 26వ తేదీన రాంబాబు తన భార్యను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారపు నానుతాడును తీసుకువెళ్లాడు. ఈ ఘటనపై శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

క్రీడా ప్రాంగణం బాగు చేయరూ!

- పాఠశాల క్రీడామైదానాన్ని ముంచెత్తుతున్న మురుగు
- అస్తవ్యస్తంగా క్రీడా ప్రాంగణం
- పునాదిపాడు పాఠశాలలో వెదజల్లుతున్న దుర్గంధం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పునాదిపాడు జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో నిలిచిన మురుగు (ఫైల్)



మురుగుతో ధ్వంసమవుతున్న వాకింగ్ ట్రాక్ (ఫైల్)

కంకిపాడు: పాఠశాలలో క్రీడా ప్రాంగణం పరిస్థితులను చక్కబెట్టేందుకు శ్రద్ధ చూపటం లేదు. పునాదిపాడు జెడ్పీ హైస్కూలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ వేసవిలోనైనా పాఠశాల ఆవరణ పరిస్థితులు మెరుగుపడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సమస్య ఇక్కడే..

పునాదిపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణాన్ని మురుగు నీరు ముంచెత్తుతోంది. లక్షలు వెచ్చించి నిర్మించిన వాకింగ్ ట్రాక్ ధ్వంసమవుతోంది. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడెకరాల క్రీడా మైదానం..

మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో మూడెకరాలకు పైగా విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉంది. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న సుమారు 500 మందికి పైగా విద్యార్థులకు క్రీడా మైదానం దోహదపడుతుంది.

ముంచెత్తుతున్న మురుగు నీరు

పాఠశాల దక్షిణ భాగం వైపు పంట బోదె ప్రవహిస్తుంది. ఇటీవల కంకిపాడు సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న గ్రామ చెరువులో చేపల పట్టివేత నిమిత్తం లీజుదారులు అందులోని నీటిని పక్కనే ఉన్న మురుగు బోదెలోకి ఆయిలు ఇంజిన్ల ద్వారా మళ్లించారు. ఒక్కసారిగా వచ్చి పడ్డ నీటితో కాలువ నిండింది. పునాదిపాడు పరిధిలోని పాఠశాల వెనుక వైపు నుంచి మురుగు క్రీడా మైదానంలోకి వచ్చి ప్రాంగణం నీట మునిగిందని స్థానికులు చెబుతున్నారు. రెండు రోజులుగా మురుగు నిలిచి ఉండటంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. పాఠశాల వ్యాపించిన దుర్వాసనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తల్లడిల్లిపోయారు.

ధ్వంసమవుతున్న వాకింగ్ ట్రాక్..

విద్యార్థులు, గ్రామస్తుల సౌకర్యార్థం దాతలు రూ.7.50 లక్షలు సేకరించి పాఠశాల మైదానంలో సువిశాలమైన వాకింగ్ ట్రాక్ నిర్మించారు. విద్యార్థులు, గ్రామస్తులు దీనిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ మురుగుతో ట్రాక్ ధ్వంసమై దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు.

చేయాల్సిన పనులు ఇవీ..

పక్కన బోది కాల్వ, ఇతర కాల్వల నుంచి మురుగు నీరు క్రీడామైదానంలోకి రాకుండా చూడాలి. క్రీడా మైదానం చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తును మరింతగా పెంచాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు ప్రహరీ పునాది ప్రాంతంలో అక్కడక్కడా రంధ్రాలు పడ్డాయి. ఈ రంధ్రాల నుంచే బయటి నీరు క్రీడా ప్రాంగణంలోకి వస్తోంది. ఈ రంధ్రాలను సత్వరమే పూడ్చివేయటం ద్వారా సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుంది. ఈ దిశగా క్రీడా ప్రాంగణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణాన్ని, వాకింగ్ ట్రాక్‌ను విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం..**
>
> చెరువును సొసైటీకి లీజుకు ఇచ్చారు. పాఠశాల క్రీడామైదానంలో మురుగు నీటి సమస్యపై సొసైటీ ప్రతినిధులతో చర్చిస్తాం. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
>
> – సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి

నేటి నుంచి గంగానమ్మ తిరునాళ్ల

నున్న(విజయవాడరూరల్): నున్న బోడపాడు గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటల నుంచి అమ్మవారి సుప్రభాతం, ఆలయశుద్ధి, నిత్యార్చన, గణపతి పూజ, పుణ్యాహవాచన, ఆఖండ దీపారాధన, కలశస్థాపన, అంకురార్పణ, అనంతరం మాను పూజ మేళతాళాలతో అమ్మవారికి గ్రామ పసుపు, కుంకుమ సమర్పణ దేవాలయ ప్రవేశం, అష్టోత్తర శత కలశాభిషేకం (108 కలశాలతో) పంచామృత అభిషేకం, అలంకరణ తీర్థ ప్రసాద వితరణ జరుగును. మంగళవారం లక్ష కుంకుమార్చన, బుధవారం శ్రీచక్రనవావరణార్చన, శ్రీగంగానమ్మ అమ్మవారి చరిత్ర ఆలపించడం జరుగుతుంది. అనంతరం అన్న సమారాధన, మే 1వ తేదీ గురువారం శ్రీపోతురాజు స్వామి వారికి, శ్రీకాలభైరవస్వామి వారికి క్షేత్రపాలక పూజ ఆరాధన జరుగును. 2న శుక్రవారం శ్రీ అశ్వద్ధ నాగలింగేశ్వర స్వామి వరికి శాంతి రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సత్యనారాయణపురం ఎస్ఐ షబ్బీర్ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు, క్రైమ్ సస్పెక్ట్ షీటర్లపై పోలీసుల నితరంతర నిఘా ఉంటుందని తెలిపారు. ఏదైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఉమెన్ ఎస్ఐ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, కుట్రలను తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. పార్టీ కంకిపాడు మండల ఆత్మీయ సమావేశం కంకిపాడు పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించారు. పార్టీ జిల్లా నేత బండెల సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ప్రసంగించారు. పార్టీ ఓటమి తట్టుకుని కేవలం మూడు నెలల వ్యవధిలోనే ప్రజల్లోకి వచ్చిన నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అని అన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ మనోధైర్యం నింపుతూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఆరోపించారు. డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజలను వంచిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్న చరిత్ర కూటమి ప్రభుత్వానిదని విమర్శించారు. కుటుంబ సమేతంగా విహారయాత్రలు చేసుకుంటున్న నేతలు ఉన్నారని, ప్రజా సంక్షేమం కోసం పాటుపడే జగనన్నపైనా, వైఎస్సార్‌సీపీపైనా కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయటంలో అందరి సమన్వయం అవసరమన్నారు. పేదలకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు, కమ్మ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రామినేని రమాదేవి, నియోజకవర్గ అనుబంధ విభాగాల ముఖ్య నేతలు భీమవరపు నాగిరెడ్డి, నందిపాటి బిందుమాధవి, పిడికిటి రామకోటేశ్వరరావు, చిట్టూరి ప్రసాద్, టెక్కెం సతీష్, తంబాబత్తుల ఓంకారం, కలపాల వజ్రాలు, కొండవీటి సుబ్బారావు, కాగిత రాజా రమేష్, మేరుగు విజయ చంద్రశేఖర్, చిప్పల రామదాసు, తోకల ఉమాదేవి, నకరికంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లో అన్నాచెల్లెళ్లకు చోటు



గిన్నిస్ బుక్ సర్టిఫికెట్లతో మేధాన్ష్, మనోజ్ఞ



గిన్నిస్ బుక్ సర్టిఫికెట్‌తో మౌనిక

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన పి.మేధాన్ష్, ఆతని సోదరి మనోజ్ఞ రోజలిండ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. ఆన్‌లైన్ బృంద సంగీత ప్రదర్శనలో మ్యూజికల్ కీబోర్డ్ వాయిద్యంలో అన్నా, చెల్లెలు ఈ ఘనతను సాధించారు. స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన పి.కిషోర్, సుజాత దంపతుల పిల్లలైన మేధాన్ష్, మనోజ్ఞ రోజలిండ గతేడాదిగా కీబోర్డ్ వాయిద్యంలో సాధన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హలేల్ మ్యూజిక్ స్కూల్‌కి చెందిన ఆగస్టీన్ దండంగి సారథ్యంలో 2024 డిసెంబర్ 1వ తేదీన ప్రపంచ స్థాయిలో ఆన్‌లైన్ సంగీత ప్రదర్శన నిర్వహించారు. ఒకేసారి 18 దేశాలకు చెందిన 1,046 మంది సంగీత కళాకారులు కీబోర్డ్ వాయించడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ సంగీత బృందంలోని మేధాన్ష్, మనోజ్ఞ రోజలిండకు ఈ నెల 25న గిన్నిస్ బుక్ ప్రతినిధులు సర్టిఫికెట్లను అందజేసి సత్కారించారు. ప్రస్తుతం మేధాన్ష్ కేకేఆర్ గౌతమ్‌లో 7వ తరగతి, మనోజ్ఞ గన్నవరంలోని వీఎస్.సెయింట్‌జాన్స్ హైస్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నారు. పిన్న వయస్సులోనే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన అన్నా, చెల్లెలను, వారిని ప్రోత్సాహించిన తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

గిన్నిస్ బుక్ అవార్డు పొందిన మౌనిక

పెనమలూరు: పోరంకి శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ చదువుతున్న యంగ్రపాటి మౌనిక గిన్నిస్ బుక్ అవార్డులో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ఆదివారం కాలేజీ యాజమాన్యం వివరాలు వెల్లడించారు. పోరంకి సరస్వతీ సౌధంలో ఇంటర్ రెండవ సంవత్సరం బైపీసీ చదువుతున్న మౌనిక గత ఏడాది డిసెంబర్‌లో హెలెన్ మ్యూజికల్ స్కూల్ ద్వారా విద్యార్థుల ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొంది. మౌనిక 45 సెకనులలో ఎలక్ట్రిల్‌కీ బోర్డుపై 3 స్వరాలను ప్లే చేసింది. మొత్తం 18 దేశాల 1,090 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా గిన్నిస్ బుక్ విజేతలను ప్రకటించటంతో మౌనికకు అవార్డు దక్కింది. ఈ మేరకు ఈ నెల 25న గుణదల మెట్రోపాలిటన్ చర్చి ఫాదర్ అగస్టీన్ గిన్నిస్‌బుక్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను మౌనికకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మౌనికలను అభినందించారు.

పహల్గాం ఉగ్రదాడులకు నిరసనగా శాంతి ర్యాలీ



క్యాండిల్ ర్యాలీలో సముదాయం వాసులు



తాడిగడప జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

గన్నవరం: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా స్థానిక వీఎస్.పురం రోడ్డులోని విశ్వ వెంచర్‌కు చెందిన గ్రేటెడ్ కమ్యూనిటీ సముదాయంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సముదాయంలోని నివాసితులందరూ క్యాండిల్స్‌ను వెలిగించి పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వవెంచర్ ఎండీ గుర్రం అంజయ్య (నాని) మాట్లాడుతూ.. పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు చేసి 28 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకోవడం దారుణమన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఇటువంటి సమయంలో దేశం అంతా ఒక్కతాటిపై నిలవాలని చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. గేటెడ్ కమ్యూనిటీ పెద్దలు ఏవీవీఎస్ఎస్.రాజు, ముక్కామల ఉమామహేశ్వరరావు, రాధాకృష్ణ, డేగల చిన్నపులయ్య, ఏఎస్.రావు, మణివర్మరాజు, ఏ.భారతలక్ష్మి, పార్వతి, రజనీకుమారి, సత్యశ్రీ, వేణుగోపాల్, గోపిరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తాడిగడప జంక్షన్‌లో..

పెనమలూరు: కశ్మీర్‌లో ఉగ్రదాడులకు నిరసనగా తాడిగడప జంక్షన్‌లో ఆదివారం రాత్రి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయక ప్రజలను పొట్టనపెట్టుకొవటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపి ప్రజలకు రక్షణకల్పించాలని కోరారు. పెనమలూరు సీఐ వెంకటరమణ, ట్రాఫిక్ సీఐ వెంకనారాయణ, ఎస్ఐ ఉషారాణి, టీడీపీ నేతలు మేడసాని రత్నకుమారి, కోయా ఆనంద్‌ప్రసాద్, తుమ్మల రామ్‌కుమార్, అనుమోలు ప్రభాకరరావు, షేక్ కరీముల్లా, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయాల్లో శిక్షణ

పెనమలూరు: పెనమలూరు గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభిస్తామని గ్రంథాలయ అధికారిణి పి.హర్షిత తెలిపారు. ఆమె ఆదివారం వివరాలు తెలుపుతూ గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. వేసవి శిక్షణలో పుస్తకపఠనం, చిత్రలేఖనం, కథలు చదివించటం, స్పోకెన్ ఇంగ్లీష్, బొమ్మల తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హర్షిత కోరారు.

కంకిపాడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.సునీత తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకూ శిబిరాలు కొనసాగుతాయన్నారు. చిన్నారులకు కథలు చెప్పటం, వినిపించటం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకూ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ తెలిపారు. శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు యోగా చేస్తే అన్ని విధాలా మేలు



పెనమలూరులో శాంతి ర్యాలీ చేస్తున్న యోగా శిక్షకులు

పెనమలూరు: విద్యార్థులు యోగా చేయటం వలన ఆరోగ్యంగా ఉంటారని శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం యోగాచార్యులు మంద్రు శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 68వ యోగా శిక్షణ ముగింపు, 69వ యోగా శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో యోగా చేయాలని సూచించారు. యోగా చేటం వల జ్ఞాపక శక్తి పెరుగుతుందని, ధ్యానం వలన మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని అన్నారు. ఆసనాల వలన ఎదుగుదల, ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు.

శాంతి ర్యాలీ..

కాగా యోగా గురువు శ్రీవెంకటేశ్వర గురూజీ పిలుపు మేరకు పెనమలూరులో శాంతి ర్యాలీ చేశారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు అయాకులపై కాల్పులు జరిపి చంపటం దారుణమని ఖండించారు. ఉగ్రవాదులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు నేరెళ్ల తులసీకృష్ణ, పలువురు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సంప్రదాయ నృత్యోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: అంతర్జాతీయ నృత్యదినోత్సవం సందర్భంగా దృశ్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నాట్యాచార్యులు, చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు నేత్రపర్వంగా సాగాయి. నగరానికి చెందిన నాట్యాచార్యులు గోనుగుంట్ల శైలశ్రీ నృత్యనిలయం, పద్మశ్రీ హేమంత్ భారతీయ నృత్యనిలయం, డాక్టర్ ఉషామాధవి సిరిమువ్వ నృత్యనికేతన్, డాక్టర్ సీహెచ్ అజయ్‌కుమార్ హంసధ్వని కూచిపూడి నృత్యాలయం, సంతోష్ శ్రీ శారదా నృత్యపీఠం, యల్లా జోస్యుల అనూరాధ శారదా నృత్యనిలయం, యువ నాట్యకళాకారులు ఎం.లేఖ్యాభరణి, సి.సిరి శృతి సమన్విలు తమ బృందాలతో 70 మంది కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా నాట్యాచార్యులు వేదాంతం పాండురంగశర్మ, గోనుగుంట్ల సత్యానందినిలను ఆత్మీయంగా సత్కరించారు.

దేశ గౌరవాన్ని చాటిచెబుతున్న నృత్యాలు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ నాట్యాచార్యులు సంప్రదాయ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఒడిస్సీ నృత్యాలు మన దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దృశ్యవేదిక సభ్యులు హెచ్‌వీఆర్ ప్రసాద్, దొంతాల ప్రకాష్, నరేన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బత్తుల రూపాశ్రీ నిర్వహించారు.

సకాలంలో గుర్తిస్తే కీళ్ల వ్యాధులు నయం



డాక్టర్ యోగితను సన్మానిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): కీళ్లలో నొప్పిని తగ్గించుకునేందుకు కేవలం పెయిన్ కిల్లర్లను మాత్రమే మార్గమని భావించకూడదని, 80 రకాల కీళ్ల సమస్యలు ఉంటాయని, సమస్య ఎక్కడని గుర్తించాలని డాక్టర్ చెన్నుపాటి యోగిత అన్నారు. సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం పటమటలోని వాసవ్య మహిళా మండలి మండపంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీళ్ల వ్యాధులను త్వరగా గుర్తిస్తే అదుపుచేయటం సులువన్నారు. సమభావన మిత్రమండలి వ్యవస్థాపకులు ఎంఎస్ స్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ యోగితను సన్మానించారు. సమభావన మిత్రమండలి అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు, డాక్టర్ యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, బీసీహెచ్ వెంకటరెడ్డి, డాక్టర్ ఎంవీరావు, డాక్టర్ పీఆర్కే ప్రసాద్, పేర్లి దాసు, నాగభూషణం పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై నృత్య కళాకారిణి నేతి రిషిత పర్యవేక్షణలో 15 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని వీక్షించి వారిని అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.